# స్వయంపాలన.. పోడుకు పట్టా

- ప్రగతి పథంలో గుంటపల్లి చెరువు తండా
- నాలుగేండ్ల కిందట పంచాయతీగా అవతరణ
- వేగంగా అభివృద్ధి పనులు
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు
- ఆనందంలో 'గిరి' జనులు


గ్రామంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న పోడు రైతులు

**సమైక్య పాలనలో అభివృద్ధికి దూరమై గోసెల్లదీసిన గుంటపల్లి చెరువు తండా స్వరాష్ట్రంలో సరికొత్తరూపు సంతరించుకున్నది. నాలుగేండ్ల క్రితం పంచాయతీగా అవతరించిన తర్వాత ప్రగతి పథంలో సాగుతున్నది. మౌలిక వసతుల కల్పనతో రంధీ లేకుండా బతుకెళ్లదీస్తున్నది. తాజాగా సర్కారు పోడు భూములకు పట్టాందనుండడంతో తండా జనం సంబురంలో మునిగితేలుతున్నది. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు బతికినంత కాలం రుణపడి ఉంటామని చెబుతున్నది.**

ఎల్లారెడ్డిపేట, జూలై 3: ఎల్లారెడ్డిపేట మండలంలోని గుంటపల్లి చెరువుతండా నాడు అభివృద్ధికి దూరంగా ఎక్కడో విసిరేసినట్టు ఉండేది. తండాలో 326 మంది జనాభా ఉండగా, అందులో 163 మంది పురుషులు, 163 మంది స్త్రీలు ఉన్నారు. 44 నివాసాలు ఉన్నాయి. రాష్ట్ర ఏర్పాటుకు ముందు అల్మాస్‌పూర్ పంచాయతీ పరిధిలో ఉండేది. నాలుగేండ్ల క్రితం సర్కారు ఈ తండాను పంచాయతీగా ఏర్పాటు చేసింది. పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి సకల సౌకర్యాలు కల్పించింది. తాజాగా 44 మంది రైతులకు 80 ఎకరాల పోడు భూములకు పట్టాలచ్చేందుకు అంతా సిద్ధం చేసింది. ఇప్పటికే కొందరికి పట్టాలిచ్చి రైతుబంధు జమ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం గిరిజన సామూహిక భవనం వద్ద సంబురాలు జరుపుకున్నది. అటు పంచాయతీగా ఏర్పా టు చేసి, ఇటు పోడు భూములపై హక్కులు కల్పించి తలరాత మార్చిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి అభిమానాన్ని చాటుకున్నది.

**శరవేగంగా అభివృద్ధి..**

ప్రభుత్వం తొమ్మిదేండ్ల పాలనలో గుంటపల్లి చెరువుతండా అభివృద్ధికి విరివిగా నిధులు వెచ్చిస్తున్నది. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అల్మాస్‌పూర్-వీర్నపల్లి ప్రధాన రహదారి నుంచి గుంటపల్లి చెరువు తండా వరకు ₹1.49 కో ట్లతో బీటీ రోడ్డు, ₹20 లక్షలతో రెండు సీసీ రో డ్లు, ₹20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మించారు. 56 కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి లూజ్‌వైర్ల సమస్యను పరిష్కరించారు. ముఖ్య కూడలిలో ₹లక్ష వెచ్చించి హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేశారు. 25వేల లీటర్ల సా మర్థ్యం కల్గిన మిషన్ భగీరథ నూతన ట్యాంకును నిర్మించి ఇంటింటికీ శుద్ధజలం అందిస్తున్నారు. ₹12.60 లక్షలతో శ్మశాన వాటిక నిర్మించా రు. చెత్త సేకరణ, చెట్లకు నీరుపట్టేందుకు ₹5.45 లక్షలతో ట్రాక్టర్, ట్యాలీని కొనుగోలు చేశారు. ఊరు శివారులో ₹2.50 లక్షలతో డంప్‌యార్డ్ నిర్మించారు. ₹1.50 లక్షలతో నర్సరీ, ₹లక్షతో పల్లె ప్రకృతి వనం, ₹1.60 లక్షలతో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు.

**అర్హులకు సంక్షేమ ఫలాలు**

గ్రామంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. ఆసరా కింద 16 మందికి నెలకు ₹34,256 పంపిణీ చేస్తున్నారు. కల్యాణ లక్ష్మి కింద నలుగురికి ₹4లక్షలు, కేసీఆర్ కిట్ కింద ఆరుగురికి ₹75 వేలు అందించారు. తొమ్మిదేండ్లలో మొత్తంగా ₹2.20కోట్లు ఖర్చు చేసింది. ఆసరా, రైతు బంధు, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, రేషన్ కింద ఏటా ₹8.86లక్షలు అందిస్తున్నది.

**పోడు రైతులకు మంత్రి భరోసా**

అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల పరిశీలనకు మంత్రి కేటీఆర్ గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తమ భూములకు పట్టాలు లేక పోవడంతో పరిహారం రాదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో ఎండ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పించాలని గోడు వెళ్లబోసుకున్నారు. అమాత్యుడు సమస్యను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. 44 మంది పోడు రైతులకు సుమారు 80 ఎకరాల భూములకు పట్టాలు రానుండడంతో ఆనందంలో మునిగితేలారు.

**రైతుబంధు డబ్బుల్ జమైనయ్..**

మా తండావాసులకు ఎవుసమే ఆధారం. నాకు తాతల ముత్తాతల కాలంనుంచి



వచ్చిన రెండెకరాల పోడు భూమి ఉన్నది. దానికి పట్టా లేక గవర్నమెంట్ నుంచి ఎలాంటి సాయం పొందలేం. తెలంగాణ రాక ముందు పట్టాల కోసం ఆఫీసుల సుట్టూ తిరిగినం, కానీ ఎవ్వరూ పట్టించుకోలేదు. కానీ తెలంగాణ గవర్నమెంట్ మాలాంటి పోడు రైతులను గుర్తించి పట్టాలిస్తున్నందుకు సంతోషంగా ఉన్నది. నాకు శనివారం రూ. 10 వేల రైతుబంధు డబ్బులు ఖాతాలో పడ్డయ్.

**-భూక్యా సంతోష్, యువరైతు (ఎల్లారెడ్డిపేట)**

**ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నం**

మా తండల ఎక్కువ మంది పోడు భూమి



దు న్నుకుని బతుకుతున్నరు. ఏండ్ల నుంచి దు న్నుకున్నా ఆ భూమికి ఇప్పటి దాక పట్టాలేదు. ఇప్పు డు సీఎం కేసీఆర్ సార్ ఈ పోడు భూములకు పట్టాలిస్తున్నరని తెలిసి తండావాసులందరూ సంతోషంగ ఉన్నరు. ఈ రోజు ఊరంత సీఎం సారుకు, కేటీఆర్ సార్‌కు సంతోషంగా పాలాభిషేకం చేసినం.

**- మాలోత్ సునీత, సర్పంచ్**



## ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ కమిటీలు

**అవగాహన సదస్సుకు హాజరైన వలంటీర్లు**

- రాష్ట్రంలోనే మొదటిసారిగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో వినూత్న కార్యక్రమం
- గ్రామానికి ఐదుగురు చొప్పన రోడ్ సేఫ్టీ విలేజ్ కమిటీలు
- రహదారుల వెంట 200 మందితో హైవే కమిటీలు
- యాక్సిడెంట్ల సమయంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించేలా శిక్షణ
- ప్రాణాలు కాపాడిన వారికి అవార్డులు

రాజన్న సిరిసిల్ల, జూలై 3 (నమస్తే తెలంగాణ)/ తెలంగాణ చౌక్ : రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రుల ప్రాణాలు కాపాడాలన్న ఉద్దేశంతో రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం చేపట్టారు. మంత్రి కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ జిల్లాలో రాష్ట్రంలోనే మొదటిసారిగా రోడ్ సేఫ్టీ విలేజ్, హైవే కమిటీలను ఏర్పాటు చేశారు. 255 గ్రామాల పరిధిలో గ్రామానికి ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేశారు. అందులో మొత్తం 1275 మంది సభ్యులున్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల వెంట ఉన్న పెట్రోలు బంకులు, దాబాలు, హోటళ్లలో పని చేసే 200 మందిని గుర్తించి కమిటీలు ఏర్పాటు చేశారు. వీరు రోడ్డు ప్రమాదాలపై తక్షణమే స్పందించి క్షతగాత్రులకు చికిత్స అందించేలా ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్ వివిధ ఎమర్జెన్సీ వైద్యంపై నెలకు రెండు సార్లు శిక్షణ ఇవ్వనున్నారు. మొదటగా ప్రైమరీ హెల్త్ సెంటర్లలోని వైద్యులతో.. ఆ తర్వాత జిల్లాస్థాయిలో వైద్య, ఆరోగ్య శాఖ వైద్యులతో శిక్షణ ఇప్పించనున్నారు. ప్రమాదాల్లో విలువైన మనుషుల ప్రాణాలు కాపాడిన వారికి గూడ్ సమర్థన్ అవార్డులను అందించనున్నారు. సోమవారం ఈ కమిటీలకు జిల్లా కేంద్రంలోని కల్యాణలక్ష్మి గార్డెన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ హాజరై, సలహాలు సూచనలు అందించారు. రోడ్ సేఫ్టీ కమిటీల్లో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువతను ఆయన అభినందించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో ఫస్ట్ రెస్పాండర్‌గా ఉండి మనుషుల ప్రాణాలు కాపాడేందుకు రోడ్ సేఫ్టీ కమిటీలు చురుగ్గా పనిచేస్తాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వారి ప్రాణాలు కాపాడాలన్న ఉద్దేశంతో ఈ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు రవికుమార్, అనిల్‌కుమార్, ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్ రావు, వైద్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

**ప్రథమ చికిత్స ప్రాణం పోస్తుంది**

ప్రస్తుతం 98శాతం రోడ్డు ప్రమాదాలతోనే మరణాలు సంభవిస్తున్నాయి. అలాంటి సందర్భాల్లో గాయపడ్డ వ్యక్తులకు కొన్నిసార్లు మనం అందించే ప్రథమచికిత్సే ప్రాణాలు పోస్తుంది. అందుకే రాష్ట్రంలోనే మొదటిసారిగా గ్రామస్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేశాం. క్షతగాత్రులను కాపాడేందుకు అవసరమైన శిక్షణ ఇస్తున్నాం. ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్, ఏడీఏ మొదలగు అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాల తీవ్రతను గుర్తించడం దగ్గరల్లోని ఆసుపత్రికి తరలించడం ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చు. ప్రమాదం జరిగిన మొదటి గంట గోల్డెన్ అవర్‌గా గుర్తించి సాధ్యమైనంత త్వరగా వ్యక్తిని బ్రతికించడానికి ప్రయత్నం చేయాలి. వలంటీర్లు కాపాడే వ్యక్తినే కాదు, ఆ కుటుంబాన్ని. ఈ కమిటీలో స్వచ్ఛందంగా శిక్షణ పొందడానికి వచ్చిన మీకు నా అభినందనలు. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి జనవరి 26, జూన్ 2, ఆగస్టు 15వ రోజుల్లో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డులు అందిస్తాం.

**- అఖిల్ మహాజన్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ**

**ఎస్పీకి ప్రత్యేక అభినందనలు**

రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది సకాలంలో చికిత్స అందకనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి వారికి ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాలు నిలబెట్టవచ్చు. రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయడం నిజంగా మంచి కార్యక్రమం. ఎస్పీకి నా అభినందనలు. అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేయడం, శ్వాస అందించడం, దవాఖానలకు తరలించడం తదితర అంశాలపై శిక్షణ ఇస్తాం. ఇలా చేయడం వల్ల ఎంతో మందిని మనం కాపాడవచ్చు.

**- మురళీధర్‌రావు, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ (సిరిసిల్ల)**

## కరువు తీర్చేలా 'కాళేశ్వరం' పరవళ్లు

- సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఎత్తిపోతలు షురూ
- లింక్ -1లో 14, 2లో 3 పంపుల ద్వారా ఎదురెక్కుతున్న జలాలు
- వర్షాభావ పరిస్థితుల్లో స్పష్టంగా కనిపిస్తున్న ప్రాజెక్టు ఫలితం


ధర్మారం: నంది పంప్‌హౌస్ 5,6 మోటర్ల టన్నెల్స్ నుంచి ఎగిసి పడుతున్న జలాలు

పెద్దపల్లి, జూలై 3(నమస్తే తెలంగాణ)/ ధర్మారం: సోమవారం బాసర వద్ద గోదావరికి ఇన్‌ఫ్లో జీరో క్యూసెక్కులు.. కానీ, ఇదే నదిలో కాళేశ్వరం వద్ద ప్రాణహిత ద్వారా వచ్చి చేరుతున్నది 27,710 క్యూసెక్కులు. దీనిని బట్టి కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అవసరాన్ని సుస్పష్టంగా తెలియజేస్తున్నది. సకాలంలో వానలు పడక పోవడంతో తాగు, సాగునీటికి కరువు రాకుండా ఉండేందుకు కాళేశ్వరం వద్ద ఇన్‌ఫ్లో ద్వారా వస్తున్న నీటిని పంపుల ద్వారా ఎత్తిపోయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి అప్రమత్తం చేశారు. ఆ మేరకు అధికారులు సోమవారం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని లింక్-1, 2లలో 17 మోటర్లను ప్రారంభించి, నీటిని ఎగువకు తరలిస్తున్నారు.


**లింక్ -1లో 14 పంపులు**

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-1లోని మూడు పంప్‌హౌస్‌ల్లో అధికారులు 14 పంపులను ప్రారంభించారు. ప్రాణహిత ద్వారా 27,710 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వ రం వద్ద గోదావరిలో కలుస్తుండగా, అధికారు లు ఇక్కడి కన్నెపల్లిలోని లక్ష్మీ పంప్‌హౌస్‌లోని 6 పంపులను ఆన్ చేసి 13,200ల క్యూ సెక్కు ల నీటిని అన్నారంలోని సరస్వతీ బరాజ్‌లోకి ఎత్తిపోస్తున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మం డలం కాసిపేలోని సరస్వతీ పంపు హౌస్‌లోని 4 పంపులను ఆన్ చేసి 11,720ల క్యూ సెక్కుల నీటిని మంథని మండలం సిరిపురంలో ని పార్వతీ బరాజ్‌లోకి, అంతర్గాం మం డలం గోలివాడలోని పార్వతీ పంపు హౌస్‌లోని నాలుగు మోటర్లను ఆన్ చేసి 10,440 క్యూసెక్కుల నీటిని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తున్నారు.

**లింక్ -2లో మూడు మోటర్లు**

ఎల్లంపల్లికి చేరిన జలాలు టన్నెల్ ద్వారా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంపు హౌస్‌కు వెళ్తుండగా, అక్కడి రెండు (5వ, 6వ)మోటర్లను ఆన్ చేసి అండర్ టన్నెల్ ద్వారా 6300ల క్యూసెక్కుల నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి టన్నెల్ ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు టన్నెళ్ల ద్వారా నీటిని తరలిస్తుండగా, అక్క డ ఐదో మోటర్‌ను ఆన్ చేసి 3150 క్యూసెక్కు ల నీటి ఎత్తిపోస్తూ వరద కాలువ ద్వారా శ్రీరాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు.

## పచ్చని పొదరిల్లు.. రంగినేని ట్రస్ట్


పచ్చని చెట్ల మధ్య రంగినేని ట్రస్ట్

నేతన్న చౌరస్తా, జూలై 3: కొబ్బరి, వేప, మామిడి, అల్లనేరేడు ఇలా తీరొక్క వృక్షాలతో సిరిసిల్లలోని రంగినేని ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ పచ్చని పొదరిల్లును తలపిస్తున్నది. పుష్కరకాలంగా వివిధ రకాల మొక్కలు నా టుతూ కంటికి రెప్పలా కాపాడడంతో ఏపుగా ఎదిగి బృందావనం తయారై అందులోకి అడుగు పెట్టే చిన్నాపెద్దకు ఎంతో ఆహ్లాదనాన్ని పంచుతున్నది. రంగినేని ట్రస్ట్‌లో 2005 నుంచి మొక్కలు నాటుతుండగా, అవి భారీ వృక్షాలుగా మారాయి. ఇందులో ముఖ్యంగా వివిధ రకాల మామిడి చెట్లు ముచ్చటగొలుపుతున్నాయి. వేసవిలో దండిగా ఫలాలనిస్తుండగా, ట్రస్ట్‌లో 60 మంది అభ్యసిస్తున్న నిరుపేద బాలురకు పంపిణీ చేస్తున్నారు. ఇలా వందలాది చెట్లతో రంగినేని ట్రస్ట్ పర్యావరణానికి స్ఫూర్తిగా నిలుస్తున్నది.